శిథిలావస్థలో ఏఈ కార్యాలయం

- మరమ్మతులకు నోచుకోని మూసీ ప్రాజెక్టు ఏఈ కార్యాలయ భవనం
- నిరుపయోగంగా సిబ్బంది క్వార్టర్స్
- కాల్వకు సంబంధించిన సమీక్షలు సూర్యాపేటలో నిర్వహిస్తున్న అధికారులు

కేతేపల్లి: కేతేపల్లిలోని మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయం (గ్యాంగ్ క్వార్టర్స్) శిథిలావస్థకు చేరుకుంది. ఏళ్ల తరబడి భవన నిర్వహణను గాలికొదిలేయటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. 1963లో మూసీ ప్రాజెక్టు నిర్మించిన సమయంలో కుడి ప్రధాన కాల్వ నిర్వహణను పర్యవేక్షించే అధికారులు, సిబ్బంది కోసం కేతేపల్లిలో జాతీయ రహదారి వెంట దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఏఈ కార్యాలయ భవనం నిర్మించారు. ఈ ఆవరణలోనే సిబ్బంది కుటుంబాలతో నివాసం ఉండేందుకు క్వార్టర్లు సైతం నిర్మించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగు ప్రయాణంలో ఈ కార్యాలయంలోనే విశ్రాంతి తీసుకునే వారు. కుడి కాల్వ నిర్వహణకు సంబంధించిన సమీక్షలు, ఆయకట్టుకు నీటి విడుదల షెడ్యూల్ రూపొందించేందుకు అధికారులు రైతులతో సమావేశాలు ఇక్కడే నిర్వహించే వారు. కుడి కాల్వ ఏఈతో పాటు, సిబ్బందితో కార్యాలయం నిత్యం కళకళలాడేది.


కేతేపల్లిలో శిథిలావస్థకు చేరిన మూసీ ఇంజనీర్ కార్యాలయ భవనం

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

గత పదేళ్ల నుంచి ఈ భవనం వైపు కన్నెత్తి చూసేవారే లేకపోవటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. సమీపంలోనే పోలీస్‌స్టేషన్ ఉండటంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలు కేసుల్లో ఇక్కడకు వచ్చే బాధితుల పంచాయతీలను ఇక్కడే నిర్వహిస్తున్నారు. ప్రహరీ ధ్వంసమై పశువులు, గొర్రెలు ఇష్టారాజ్యంగా తిరుగుతుండటంతో పచ్చదనం కోల్పోయింది. ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జాతీయ రహదారి వెంట ఉన్న మూసీ ఏఈ కార్యాలయ భవన మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

నిధుల కొరతతో..

కాలక్రమంలో నిధుల కొరత, నిర్వహణ లోపంతో మూసీ ఏఈ కార్యాలయ భవనంలో పాటు, పరిసర ప్రాంతాలు అందాలను కోల్పోయాయి. ఏఈ కార్యాలయం భవనం పైకప్పు శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉంది. కార్యాలయంలోని దర్వాజాలు, తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఊడిపోయే స్థితికి చేరుకున్నాయి. దీంతో పాటు సిబ్బంది పదవీ విరమణలే తప్ప కొత్తగా నియామకాలు లేకపోవటంతో సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ నిరుపయోయంగా మారి శిథిలావస్థకు చేరాయి. దీంతో అధికారులు ఇక్కడకు రావడం పూర్తిగా మానేశారు. కుడి కాల్వకు సంబంధించిన సమీక్షలు సూర్యాపేటలోని మూసీ డీఈ కార్యాలయంలో, మూసీ ప్రాజెక్టు వద్దనే నిర్వహిస్తున్నారు.


ధ్వంసమైన ప్రహరీ

ప్రత్యేక నిధులు కేటాయించాలి



"రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మూసీ కుడి కాల్వ ఏఈ కార్యాలయ భవన నిర్వహణను పాలకులు పట్టించుకోవటం లేదు. కార్యాలయం శిథిలావస్థకు చేరటంతో మూసీ అధికారులను కలిసేందుకు రైతులకు ఇబ్బందిగా మారింది. ఏ చిన్న సమాచారం తెలుసుకోవాలన్నా సూర్యాపేట పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం కార్యాలయ భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– కోట లింగయ్య, చీకటిగూడెం

ప్రతిపాదనలు పంపించాం

"నిర్వహణ లేకపోవడంతో మూసీ ఏఈ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. కార్యాలయ మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపట్టి కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, మూసీ డీఈ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నకిరేకల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నకిరేకల్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ప్రగతి కోరారు. నకిరేకల్‌లోని ఎస్‌బీఐ శివాజీనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మెయిన్ సెంటర్లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు పెరిగినందున మోసాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సతీష్, అనూష, సైదులు, భాస్కర్, భవ్య, వెంకన్న పాల్గొన్నారు.


కళాజాతలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు

20న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ శంభయ్య

నకిరేకల్: వచ్చే నెల 1వ తేదీన ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదినాన్ని పురస్కరించుకుని నకిరేకల్ నియోజకవర్గ యూత్ నాయకుడు వేముల విపుల్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 20 న నకిరేకల్ మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజిత శనివారం స్థానికంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకన్న, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, కౌన్సిలర్లు సుకన్య, సైదులు, లక్ష్మీవెంకన్న పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన యాకుబ్–అమినబీల కుమార్తె ఆష్మ కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఆపద్బంధువు ఫౌండేషన్ ద్వారా ప్రధాన కార్యదర్శి జక్కుల స్వప్న యాదవ్, శ్రీకాంత్‌చారి, మను అర్జున్ చేతుల మీదుగా చిన్నారి కుటుంబానికి శనివారం రూ.33వేలను వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. వారి వెంట ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్, ఉపాధ్యక్షులు గణేష్, చిలుక వెంకటేష్, సాయికుమార్, హరికృష్ణ, రవీందర్ తదితరులున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

క్లుప్తంగా

సురేష్ గుప్తకు ప్రతిభా పురస్కారం


సురేష్‌కు అవార్డు అందజేస్తున్న దైవజ్ఞశర్మ, మాజీ పోలీస్ అధికారి సత్యనారాయణ

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన పర్యావరణ వేత్త మిట్టపల్లి సురేష్ గుప్తకు డాక్టర్ చిక్కా దేవదాస్ 2025 రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా చేనేత వస్త్రాలను ధరించి సేంద్రియ వ్యవసాయ మొక్కల పెంపకం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను ఆయన ప్రతిభా పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానకళానిలయంలో చిక్కా దేవదాస్ జన్మదినం సందర్భంగా మాజీ పోలీస్ అధికారి సుంకర సత్యనారాయణ, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీరామరాజు, మధుర కవి చిక్కా శంకర్, సురేందర్, పుష్పలత పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌కు అంబేద్కర్ జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న కిశోర్‌కుమార్

నల్లగొండ టౌన్: నల్లగొండలోని అన్నెపర్తి బెటాలియన్‌లో ఏఆర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లె కిశోర్‌కుమార్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్నారు. సంగీత కళాకారుడిగా సామాజిక సేవా కార్యక్రమాలు, తెలుగు నాటక రంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఢిల్లీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆయనకు అవార్డు అందజేసింది. శనివారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెన్నారావు, జీఎస్‌టీ చీఫ్ కమిషనర్ ఎస్.కె. రహమాన్, ఇన్‌కమ్‌టాక్స్ న్యూఢిల్లీ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు చేతులమీదుగా కిశోర్‌కుమార్ అవార్డు అందుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన అయితరాజు సాయికుమార్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.38వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ కొనేటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, నాయకులు పల్లపు బుద్ధుడు, పట్ల జనార్దన్, జనపాల శ్రీను, మర్రి రమేష్, మాదగోని మహేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

చండూరు: ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ అన్నారు. శనివారం చండూరులోని మాదగోని నర్సింహ భవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పార, గడ్డపార, తట్ట తదితర పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జానిమియా, ఊషయ్య, నాయకులు సంజీవ, యాదయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, మల్లయ్య, చంద్రమౌళి, మల్లయ్య, వెంకటేశం, జగన్, లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

లచ్చిరాంకు సన్మానం

నల్లగొండ: జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న రిసోర్స్ పర్సన్లకు శనివారం స్థానికంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల రిసోర్స్ పర్సన్, తెలుగు ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ రామచంద్రయ్య, కోర్సు డైరెక్టర్ నాగయ్య, డీఆర్పీలు బాలాజీ, నరసింహమూర్తి, వెంకట్ రెడ్డి, నూనె సుదర్శన్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

నకిరేకల్: వానకాలం సీజన్‌కు సంబంధించి విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని నకిరేకల్ వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు ఎండీ జానిమియా సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో శనివారం నకిరేకల్‌లోని నిమ్మ మార్కెట్‌లోని రైతు వేదికలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని షాపుల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల స్టాక్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. బిల్లులు, స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎస్‌కే హిద్యాతుల్లా, ఆత్మ బీటీఎం విక్రమ్, డీలర్లు పాల్గొన్నారు.



నకిరేకల్: మాట్లాడుతున్న జానిమియా

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే పీడీ యాక్ట్

చిట్యాల: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు అమలు చేస్తామని నకిరేకల్ ఏడీఏ జానిమియా హెచ్చరించారు. శనివారం చిట్యాలలోని రైతు వేదికలో మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను, పురుగుమందులను ఎమ్మార్పీకే విక్రయించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. రైతులకు వానకాలం వ్యవసాయ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను వ్యవసాయ శాఖ ద్వారా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఏఓ పగిడిమర్రి గిరిబాబు, పోలీసు సిబ్బంది, ఏఈఓలు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో శనివారం స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ -327(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో సంఘం ఉద్యోగులు, కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఐఎన్‌టీయూసీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖ లో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అండగా ఉంటున్న ఐఎన్‌టీయూసీ సంఘం సేవలను కొనియాడారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఆ సంఘం నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజిత, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ సకినాల రవి, కంపెనీ జాయింట్ సెక్రటరీ ఎండీ అబ్బాస్, కౌన్సిలర్లు గాజుల సుకన్య, గర్శకోటి సైదులు, డివిజన్ ప్రతినిధులు పాండు, శంకరయ్య, వెంకట్రావ్, శ్రీనివాసులు, రామ్మూర్తి, వెంకన్న, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, రవి, సాధన లక్ష్మి, మౌనిక, లక్ష్మమ్మ, రాజేశ్వరి, సంజీవ, సైదులు, కోడదల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

హనుమాన్ జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హనుమాన్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 22 జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా రూపొందించిన కరపత్రాలను శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరగోని రాజయ్య, కమిటీ సభ్యులు సురిగి యాదగిరి, కస్పరాజు వెంకటేశ్వర్లు, గుండెబోయిన శేఖర్, ఆవుల శ్రీనివాస్, భాస్కర్, రాంప్రసాద్, సంపత్ పాల్గొన్నారు.

పుష్కరాలకు స్థానిక ఎంపీని ఆహ్వానించకపోవడం సరికాదు

నల్లగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రారంభమైన సరస్వతి నది పుష్కరాలకు స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకపోవడం సరికాదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అన్నారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యత వహించి ఎంపీకి క్షమాపణ చెప్పాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జంగాల లక్ష్మమ్మ, రాష్ట్ర కార్యదర్శులు జంగాల భిక్షం, గండమల్ల జానయ్య, వెంకటేశ్వర్లు, అనంతరాములు పాల్గొన్నారు.

ఫిష్ పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్ : ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసే ఫిష్ పాండ్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కడెం రాంమోహన్ కోరారు. శనివారం కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో జరుగుతున్న కమ్యూనిటీ ఫిష్ పాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో అన్ని రకాల పండ్ల తోటలు, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, దానిమ్మ చెట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రూ.6 లక్షలతో ఫిష్ పాండ్‌లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి యాదగిరి తదితరులు ఉన్నారు.

20న నల్లగొండలో నిరసన ప్రదర్శన

నల్లగొండ టౌన్: ఈనెల 20వ తేదీన జరగాల్సిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడిందని, అయితే ఈ నెల 20న నల్లగొండలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య తెలిపారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ పట్టణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో నిర్వహించే నిరసన ప్రదర్శనకు కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో అవుట రవీందర్, సలివోజు సైదాచారి, పందుల లింగయ్య, మిరియాల శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు గోపాల్‌రెడ్డి కన్నుమూత



వనస్థలిపురం(హైదరాబాద్): స్వాతంత్య్ర సమరయోధుడు మన్నె గోపాల్ రెడ్డి(99) శనివారం మృతిచెందారు. మునుగోడు నియోజకవర్గం సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని గుడిమల్కాపూర్‌కు చెందిన గోపాల్‌రెడ్డి.. వనస్థలిపురం ద్వారకామయినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

శాలిగౌరారం: సమాజంలో జరిగే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ వెంకటయ్య అన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు శనివారం శాలిగౌరారం మండలంలోని తిరుమలరాయునిగూడెంలో ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, చైన్‌స్నాచింగ్, సైబర్ మోసాలు, బాల్యవివాహాలు, అగ్నిప్రమాదాలు, గంజాయి, డ్రగ్స్ వాడకం, దొంగతనాలు, అపరిచిత ఫోన్‌కాల్స్ పట్ల జాగత్త వహించడం, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే 100 నంబర్‌కు ఫోన్‌చేయడం లాంటి అంశాలను వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగయ్య, జానయ్య పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మీయ సమ్మేళనం

కేతేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2013–14 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జటంగి పరమేష్, వెంకటేష్, పవన్, నాగరాజు, గణేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మొక్కుబడి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనగల్: మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో శనివారం ఆలయ అర్చకుడు చిలకమర్రి శ్రావణ కుమారాచార్యుల ఆధ్వర్యంలో భక్తులు మొక్కుబడి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు.

ఆర్థిక చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మునుగోడు: మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడేనికి చెందిన యంపల్ల నరేష్ గత పది రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. అతడి భార్య, ఇద్దరు పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉండగా అతడితో పాటు పదోతరగతి చదివిన తోటి స్నేహితులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వారంతా చందాలు వేసుకొని సమకూర్చిన రూ.లక్షా2వేలను శనివారం నరేష్ కుటుంబసభ్యులకు అందజేశారు.

యూబీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ నూతన మేనేజర్ విజయసింహారెడ్డి కోరారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సురేందర్‌బాబు బదిలీ అయిన సందర్భంగా ఆయనను సన్మానించారు.

సీపీఐ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: సీపీఐ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం గుండ్రాంపల్లిలో నిర్వహించిన మండల మహాసభలలో ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మండల కార్యదర్శిగా ఎండీ అక్బర్(చిట్యాల), మండల సహాయ కార్యదర్శిగా జిల్లా సత్యం(గుండ్రాంపల్లి)లతో పాటు 13 మంది మండల కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవాకేంద్రం, ఈదులూరులోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 50శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్ శనివారం తెలిపారు. రైతులు 30 కేజీ బస్తాను సబ్సిడీపై రూ.2137.50కు కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెదిర మధుసూదన్‌రెడ్డికి నేతల నివాళి

మునుగోడు: సీఎం రేవంత్‌రెడ్డి సమీప బంధువు, వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిర మేఘారెడ్డి తండ్రి వెదిర మధుసూదన్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో నిర్వహించారు. పలువురు నేతలు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్, సీఎం మామ సూదిని పద్మారెడ్డి, సీఎం అత్త పారిజాత, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పట్టికోటి శేఖర్, వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జాల వెంకన్న, తాటికొండ సైదులు, నకిరకంటి యాదయ్య, పాలకూరి యాదయ్య గౌడ్, జంగిలి నాగరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి తదితరులున్నారు.


మధుసూదన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

పొంచి ఉన్న ప్రమాదం

శాలిగౌరారం: మండలంలోని గురుజాల–అమ్మనబోలు ప్రధాన రోడ్డు వెంట మనిమద్దె, ఎన్‌జి కొత్తపల్లి చౌరస్తా వద్ద రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సింగిల్‌రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినపుడు ప్రమాదాలు నెలకొంటున్నాయి. సంబంధిత అధికారులు ప్రమాదకర గోతులను పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.


గురుజాల–అమ్మనబోలు రోడ్డు వెంట ఏర్పడిన గుంత